నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం విద్యుత్ సబ్ స్టేషన్ 11 కెవి ఫీడర్ పరిధిలో మరమ్మతులు, కొత్త పోల్స్/లైన్లు ఏర్పాటు నిమిత్తం నేడు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు అమలాపురం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం 11 కెవి ఫీడర్ పరిధిలో రెండు ఫీడర్లు, కొత్త పోల్స్/లైన్ ఏర్పాటు చేసే నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ ముమ్మిడివరం, కొత్తలంక, కర్రివానిరేవు, గాడిలంక, అన్నంపల్లి, చింతపల్లిలంక, చిన్న కొత్తలంక, గేదెలంక, కోమానపల్లి, వరగల్లంక, వడ్డిగూడెం, గోదాసీవారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

కొబ్బరి పరిశ్రమల స్థాపనపై సమీక్ష

- వివిధ శాఖల అధికారులతో పలు అంశాలపై చర్చించిన కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాలోని కొబ్బరి, క్వాయర్ పారిశ్రామికవేత్తలు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఎమ్ ఎస్ఎంఇ ప్రతినిధులు, ఉద్యాన అధికారులతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శుక్రవారం మామిడికుదురు, ఉప్పలగుప్తంలలో కొబ్బరి పరిశ్రమలు స్థాపన అంశాలపై సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత జిల్లాగా పేరుగాంచిన జిల్లాలో కొబ్బరి ముడి సరకు ఆధారంగా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో రైతులకు, మహిళా సంఘాలకు, యువ పారిశ్రామిక వేత్తలకు దిక్సూచిగా ఇంక్యు బేషన్ సెంటర్ నిలుస్తుందన్నారు. కొబ్బరి ముడి సరుకుకు స్థిరమైన మార్కెట్, అధిక ఆదాయం, శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పన ద్వారా సుస్థిర జీవనోపాధి, ఆర్థిక లాభాలు మెండుగా ఉన్నాయన్నారు. కొబ్బరిని నేరుగా అమ్మడం కంటే, వర్జిన్ కొబ్బరి నూనె, కొబ్బరి చిప్స్, కొబ్బరి పాలు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మారుస్తే, యూనిట్‌కు ఎక్కువ ధర లభించి కొబ్బరి రైతాంగం అధిక లాభాలను ఆర్జించవచ్చునన్నా రు. ఈ ప్రధాన లక్ష్యంతో మామిడికుదురు నందు రూ.10 కోట్లతో ఎంఎస్ఎంఇ ద్వారా నిధులు కేటాయింపు జరిగిందన్నారు. దీని విస్తరణకు సవరించిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. అదేవిధంగా నూతనంగా ఉప్పలగుప్తం నందు కొబ్బరి ఉత్పత్తుల ఇంక్యుబేషన్ సెంటర్ నెలకొల్పి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, కొబ్బరి రైతులను అన్ని విధాల ప్రోత్సహించడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు తెలిపారు ఈ సెంటర్ ద్వారా పెట్టుబడి రాయితీలు ఏ విధమైన ఉత్పత్తులు ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చునో నిశితంగా వివరించాలన్నారు. ఆ దిశగా మార్గనిర్దేశం దిశా నిర్దేశం యూనిట్ ఏర్పాటు దిశగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ముడి కొబ్బరి ధరలు మారినా, ప్రాసెస్డ్ ఉత్పత్తులకు డిమాండ్ స్థిరంగా ఉండటం వల్ల రైతులకు ఆదాయ స్థిరీకరణ సాధ్యమవుతుందన్నారు. ఒకే ప్రాంతంలో ప్రాసెసింగ్ సౌకర్యం ఉండ టంతో రవాణా ఖర్చులు తగ్గి, రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్లు వర్జిన్ కొబ్బరి నూనె, కొబ్బరి చిప్స్, కొబ్బరి పాలు, కొబ్బరి చక్కెర వంటి ఉత్పత్తుల తయారీ టెక్నాలజీపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తాయన్నారు. పారిశ్రామిక వేత్తల అభివృద్ధి, ఉపాధి కల్పనకు మార్గ నిర్దేశం చేస్తాయన్నారు ఈ కేంద్రాలు అగ్రిబిజినెస్ ఇంక్యుబేషన్' మోడల్‌లో పనిచేస్తూ, కొత్త స్టార్టప్‌లకు మార్కెట్ టెస్టింగ్ కోసం సౌకర్యాలు కల్పిస్తాయన్నారు. మహిళా సంఘాలు, యువత గ్రూపులు చిన్న యూనిట్లు ప్రారంభించడం ద్వారా.ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ వంటి ఉద్యోగాలు ఏర్పడి గ్రామీణ ఉపాధి పెరుగు తుందన్నారు. కొబ్బరి ఉత్పత్తి పరిశ్రమలకు చెందిన నిపుణులను తమిళనాడు ఇతర రాష్ట్రాల నుంచి పిలిపించి ప్రాజెక్టులు సంబంధించి స్థల పరిశీలన సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేయనున్నట్లు తెలి పారు ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ ప్రతినిధి అభినయ్, పరిశ్రమల కేంద్రం జిఎం అరుణ డిహెచ్ఒ బివి.రమణ తదిత రులు పాల్గొ న్నారు.


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

రైతులకు పంట నష్టపరిహారం

విద్యుత్ అంతరాయాలను లోవోల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు జిల్లాకే తలమానికంగా అయినవిల్లి నందు నిర్మి స్తున్న 400 కె వి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు సంబంధించి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక చొరవతో 22 కిలోమీటర్ల మేర విద్యు త్ టవర్ల ఏర్పాటు చేస్తున్నారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఈ సమయంలో పనుల నిర్వహణగాను ఆయా ప్రాంత రైతులు రబీ సీజన్లో పంట నష్టపోయినందుకుగాను ఎకరాకు రూ.60,613 పంట నష్టపరిహారంగా ఎపి ట్రాన్స్‌కో నుంచి అందిస్తు న్నట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు ఎపి ట్రా న్స్‌కో, రెవెన్యూ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి విద్యుత్తు టవర్ల ఏర్పాటు అంశంపై సమీక్షించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నూతనంగా ఏర్పడిన తరువాత విద్యు త్ అవసరాలను లో వోల్టేజీ సమస్యలను దృష్టిలో ఉంచుకొని శాశ్వతంగా, నిరంతరాయంగా, పుష్కలంగా విద్యుత్ సరఫరా జరిగే దిశగా అయినవిల్లి నందు సబ్‌స్టేషన్ నిర్మిస్తారన్నారు. దీనికి సంబంధించి అయినవిల్లి రావుల పాలెం కొత్తపేట అంబాజీపేట అయినవిల్లి మండలాల పరిధిలో 64 విద్యుత్ టవర్లను ప్రతిపాదించారని వీటికి సంబంధించి 14 టవర్ల ఫౌండేషన్ పూర్తయిందని 4 టవర్లకు ఎరెక్షన్ పూర్తయిందన్నా రు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 మే నాటికి ఈ యొక్క టవర్ల నిర్మాణం పూర్తి చేయాల న్నారు. మెగా ఇంజనీరింగ్ విభాగం వారు అదనంగా గ్యాంగ్‌మాన్ లను నియ మించుకొని 2026 మే నెల నాటికి టవర్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ టవర్లు వెంబడి వ్యవసాయ సాగు క్షేత్రాలలో రబి పంట సాగు చేయకుండా సుమారు 563 ఎకరాలలో రబీ సాగును నిలుపుదల చేసినట్లు తెలిపారు. వీరికి పంట నష్టానికిగాను ఎకరాకు రూ 60,613 లు చొప్పున వెరసి రూ.3.41 కోట్లను గతంలో ఎన్నడూ లేని విధంగా ఎపి ట్రాన్స్‌కో కేటాయించిందన్నారు. ఈ నిధులను సంక్రాంతి లోపు సంబంధిత రైతులకు విడు దల చేస్తుందన్నారు. ఎంపీ గంటి హరీష్ మాదుర్ మాట్లాడుతూ రైతులు ప్రజాప్రతినిధులు జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఈ టవర్లు ఏర్పాటు నిర్దేశిత సమ యానికి పూర్తి చేస్తూ రానున్న వేసవి నుండే నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూ చించారు. రైతులు కూడా తమ పొలాలలో సాగునీరు పారకుండా తగు జాగ్రత్తలు పాటించి టవర్ల ఏర్పాటుకు పూర్తిగా సహకరించాలన్నారు. ప్రజాప్రతినిధులు కూడా తమ వంతు సహకారం ఈ టవర్ల ఏర్పాటులో తప్పని సరిగా అందిస్తారన్నారు. జిల్లాలో విద్యుత్ కొరత లేకుండా ఈ యొక్క ప్రాజెక్టు ను త్వరగా ప్రభుత్వ నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని కోరారు . ప్రభల ఉత్సవాలకు ఈ టవర్లు వల్ల ఎటువంటి ఆటంకం కలగకుండా ట్రాన్స్‌కో అధికా రులు కొంతమేర ఎత్తును పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా ఉత్సవాల సమయంలో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలుపుదల చేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహించు కునేందుకు ట్రాన్స్కో తగిన సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ పి. శ్రీకర్, ఎపి ట్రాన్స్‌కో పర్యవేక్షకు ఇంజినీర్ మనోహర్, ఇఇలు పుల్లారావు, వెంకట్రావు, డిఇ చంద్రశేఖర్ ఎ ఇ అనిల్, తహశీల్దార్లు రాంబాబు, చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - కాట్రేనికోన

పండగల నేపథ్యంలో శాంతి భద్రతలు పరిరక్షణకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఎస్‌పి రాహుల్ మీనా పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి రాహుల్ మీనా శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, భద్రతా ఏర్పాట్లు, స్టేషన్ మెయింటెనెన్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తనిఖీల అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ నిర్వహణ సంతృప్తికరంగా ఉందన్నారు. సంక్రాంతి పండుగ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కోడిపందేలు, గుండాటలు, జూదాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడా జరగనివ్వబోమని స్పష్టం చేశారు. ఇలాంటి వాటిని ఆడినా, ప్రోత్సహించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే చర్యలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట అమలాపురం డిఎస్‌పి టి ఎస్ఆర్‌కె.ప్రసాద్, ఎస్ఐ అవినాష్ ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి రాహుల్ మీనా

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ ధ్యేయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి, ప్రజల సమస్యలు, విజ్ఞప్తులు పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శుక్రవారం రామచంద్రపురంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి వారం 'గ్రీవెన్స్ డే'గా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, నమోదు చేసి పరిష్కారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంటు కమిటీ కార్యదర్శి సిర్రా సురేష్, అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, కూటమి పార్టీ శ్రేణులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

కిడ్నీ బాధితునికి రూ.10 వేల సాయం

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం రూ.10 వేలు సాయం అందించారు. కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన కమ్మసత్తి ప్రసాద్ కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ప్రసాద్ ఆర్థిక పరిస్థితిని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ శుక్రవారం రూ.10 వేల చెక్కు అందజేశారు. మెరుగైన వైద్య సేవల కోసం కాకినాడ ఆసుపత్రికి పంపించి వైద్య సేవలు అందించారు. మంత్రి సుభాష్‌కు ప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి అమలాపురం పార్లమెంట్ కార్యదర్శిగా సువర్చ

ప్రజాశక్తి - ఆలమూరు

టిడిపి అమలాపురం పార్లమెంటు కార్యదర్శిగా పినపళ్ల మాజీ ఎంపిటిసి సభ్యురాలు వక్కపట్ల లక్ష్మీ సువర్చను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర టిడిపి అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. సువర్చన భర్త లక్ష్మణరావు 2013లో ఆలమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. పదవి రావడానికి సహకరించిన ఎంఎల్ఎ బండారు సత్యానందరావుకు వారు కతజ్ఞతలు తెలిపారు.


నామన రాంబాబును సత్కరిస్తున్న పల్లంరాజు

జెడ్‌పి మాజీ ఛైర్మన్ నామనను కలిసిన పల్లంరాజు

ప్రజాశక్తి- మామిడికుదురు

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గంధం పల్లంరాజు శుక్రవారం జెడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబును మగటపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు అంతా సమిష్టి గా పని చేద్దామని రాంబాబు, పల్లంరాజులు పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నగరం పిఎసిఎస్ ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు, ఈదరాడ పిఎసిఎస్ ఛైర్మన్ బొలిసెట్టి జగదీష్, నామన నాగేశ్వరరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మామిడికుదురు

లూటుకుర్రులో నిర్మిస్తున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ అడబాల తాతకాపు శుక్రవారం భూమి పూజ చేశారు. అమలాపురం ఎంపీ హరీష్ మాదుర్ నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, కూటమి నాయకులు విల్ల సుబ్బారావు, బోనం బాబు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



టెన్త్ విద్యార్థులకు ఉపాధ్యాయుల వితరణ

ప్రజాశక్తి - అమలాపురం

స్థానికమహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ కారణంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రూ.30 వేలను వారి తల్లిదండ్రులకు శుక్రవారం అందజేశారు. ఎలుమర్తి నీరజ్ న్యూమోనియా వ్యాధితో బాధపడుతూ కిమ్స్ ఆసుపత్రితో చికిత్స పొందుతున్నాడు. ఈ కారణంగా నీరజ్ తల్లితండ్రులకు రూ. 15 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న మరో 10వ తరగతి విద్యార్థి మల్లాడి విష్ణు ప్రసాద్ తల్లిదండ్రులకు రూ.15వేలను డిఇఒ పి.నాగేశ్వరరావు చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఇఒ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తొందరగా కోలుకోవాలని, పబ్లిక్ పరీక్షలుకు సన్నద్ధం కావాలని వారిని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు కె.ఘన సత్యనారాయణ, ఉపాధ్యాయులు బిఎస్.వెంకటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, పిహెచ్.వర్మ, భవాని, ప్రసాద్, సత్యనారాయణ, మట్టపర్తి శ్రీనివాస్, కర్రా శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాసరావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న డిఇఒ

డెంగీ నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రస్తుత వాతావరణంలో డెంగీ విజృంభించే లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచి వ్యాధి బారిన పడకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. వానపల్లి పిహెచ్‌సి బిళ్ళకుర్రు ఉపకేంద్ర పరిధిలో వాకాడవారిపాలెం నందు అనుమానిత డెంగీ కేసు నమోదైంది. ఆ ప్రాంతంలో ఆయనతో పాటు కొత్తపేట మలేరియా సబ్ యూనిట్ అధికారి యస్.రాజబాబు శుక్రవారం పర్యటించారు. ఆ ఏరియాలో ఫ్రైడేడ్రైడే కార్యక్రమ నిర్వహణ, ఇంటింటా సందర్శనల ద్వారా దోమల లార్వా గుర్తింపు, ఎబెట్, ఇండోర్ స్ప్రేయింగ్ చేయాలన్నారు. ఈ విషయంలో పంచాయతీ సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు ఇళ్ళ శ్రీను, ఆశా డి.మంగాదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు శీతాకాలం నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వివిఎస్ఎం.మూర్తి, డాక్టర్ వి.శారద సూచించారు. పాశర్లపూడి పంచాయతీ కార్యాలయం లో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆధ్వర్యంలో అమలాపురం రోహిణి తల్లి పిల్లల ఆస్పత్రి వారు శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం లో 72 మంది చిన్నపిల్లలకు, 19 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన రూ.20 వేల విలువైన మందులు ఉచితంగా అందజేశారు. చలిగాలులు ఎక్కువగా ఉండటం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిని దష్టిలో పెట్టుకుని ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జి.వాసు, హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సేవలు అందించారు.


గర్భిణులు, బాలింతలకు సూచనలు ఇస్తున్న డాక్టర్ మూర్తి

ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో సిపిఎం 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనం లో సిపిఐ పతాకాన్ని సీనియర్ నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా స్టాలిన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి.గోపాలరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రాము మాట్లాడుతూ భారతదేశంలో డిసెంబర్ 26, 1925న ఉత్తరప్రదేశ్ లో కాన్పూర్ నగరంలో ఎస్‌కె. ఘూటే అధ్యక్షతన సిపిఐ ఆవిర్భవించిందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం అనేక కుట్ర కేసులతో నిర్బంధాన్ని ఎదుర్కొంటూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేసిందన్నారు. సమాజంలోని పేదరికం, లింగ, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిందన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షంగా ఉంటూ కార్మికుల హక్కుల కోసం అనేక చట్టాలు, వ్యవసాయ కార్మికుల కోసం భూసంస్కరణ చట్టం, బ్యాంకులు జాతీయకరణ, రాజాభరణాల రద్దు, ప్రజలందరికీ విద్యుత్తు, పేదలకు ఇల్లు, నిరుద్యోగం సమస్యలు పరిష్కారానికి కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో ఎం. ప్రేమనందం, ఎస్.శారదాదేవి, బిసి సంఘాల నాయకులు బి.రామకష్ణ, యు.రాంబాబు, పార్టీ కార్యకర్తలు వి.కృష్ణమూర్తి, కృష్ణ, జి.రాజు, ఎ.మాచరావు, ఎం.గోపి, బి.సత్యనారాయణ, నాగమణి, సరోజ, సుధా, సభ్యులు పాల్గొన్నారు.


ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు స్టాలిన్ తదితరులు

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - కొత్తపేట

విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని వికెవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు సూచించారు. కళాశాలలో కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు మాట్లాడుతూ కంప్యూటర్ ఆవిష్కరణలో చార్లెస్ బాబేజ్ కృషిని కొనియాడారు ఈ సందర్భంగా విద్యార్థులకు పిపిటి ప్రజెంటేషన్ కాంపిటీషన్స్, క్విజ్ కాంపిటీషన్స్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమాదేవి, డాక్టర్ అంకమరావు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ పాపారావు, నాగరాణి, కడలి ప్రసాద్, కావ్య, విజయ్‌కుమార్, హేమలత, సాయికృష్ణ, సాయి లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

బాల్య వివాహ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రతీ ఒక్కరు బాల్యవివాహాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పేర్కొంది. బాల వివాహ ముక్త్ భారత్ వందరోజుల కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని పరిమళ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ అవగాహనా సదస్సులో కమిటీ సభ్యులు దాసరి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజం లో కొనసాగుతున్న బాల్యవివాహాలు, వెట్టి చాకిరీ, బాల కార్మిక నిర్మూలనకు ఎన్నో చట్టాలు ఉన్నాయని అన్నారు. వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా ఈ వివక్షలను అధిగమించవచ్చునని అన్నారు. మహిళలంతా విద్యావంతులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగునికి రమణారావు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భీమనపల్లికి చెందిన వికలాంగుడు మందపల్లి వెంకట రామమూర్తికి అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన వికలాంగుడు వెంకట రామమూర్తి గృహ నిర్మాణం చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న రమణారావు సమకూర్చిన రూ.15 వేల చెక్కును శుక్రవారం వెంకట రామమూర్తికి గుడ్‌సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్, విప్పర్తి రమేష్, ఎస్.చిరంజీవి, పందిరి సుబ్బరాజు, అంజి, మణికంఠ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు

ఎంఎల్ఎ సుబ్బరాజును కలిసిన డిఇఒ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లా విద్యాశాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.నాగేశ్వరరావు శుక్రవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలోని మురమళ్ళ లోని ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం నందు ఎంఎల్ఎ సుబ్బరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న విద్యాపరమైన కార్యక్రమాలతో పాటు విద్యా పరంగా సాధిస్తున్న ప్రగతిని, పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళికను వివరించారు. ఆయన వెంట డిసిఇబి సెక్రటరీ బి.హనుమంతరావు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందిస్తున్న డిఇఒ నాగేశ్వరరావు


పాదయాత్ర చేస్తున్న ఎంఎల్‌సి రాజశేఖర్

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎంఎల్‌సి రాజశేఖర్

ప్రజాశక్తి - ఐ.పోలవరం

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉభయగోదావరి పట్టభద్రుల ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. జి.వేమవరంలో ఉన్న ఆయన నివాసం నుంచి శుక్రవారం తాళ్లరేవు మండలం మట్లపాలెం మహాలక్ష్మి ఆలయం వరకు 26 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఉదయం 5.30 గంటలకు ఆయన పాదయాత్రను ప్రారంభించారు. దారిపొడుగునా అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు,స్నేహితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మంచి జరగాలని, కూటమి ప్రభుత్వ పరిపాలన సక్రమంగా జరగాలని ఈ పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట పెంటా రవివరప్రసాద్, చోడిశెట్టి బ్రహ్మానందం, లంకలపల్లి మునిరాజు, చిక్కాల శ్రీనివాసరావు, మద్దింశెట్టి పురుషోత్తం, చోడిశెట్టి నాగబాబు, డాక్టర్ కర్రి చంద్రశేఖర్,తాళ్లూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

29న ఉపాధి భవన్‌లో జాబ్‌మేళా

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఉపాధిభవన్‌లో ఈ నెల 29న సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే డిడియుజికెవై ట్రైనింగ్‌సెంటర్లలో వివిధ కోర్సుల కొరకు శిక్షణ తీసుకొనే అభ్యర్థులు ఎంపికకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. కాకినాడ, రాజమండ్రి, సామర్లకోట, ముమ్మిడివరం, అమలాపురం సెంటర్లలో ఉన్న రిటైల్, వెబ్‌డెవలపర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, రోడ్‌సర్వేయర్, ఎలక్ట్రికల్, ప్లంబర్, మల్టీ టెక్నీషియన్, హోమ్ వంటి కోర్సులలో 90 రోజులు శిక్షణ కల్పించి వారికి ఉపాధి అవకాశం కల్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో భోజన, వసతి సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. టెన్త్ ఆపై విద్యార్హత గల విద్యార్థులు 18 నుంచి 35 సంవత్సరాలు ఉన్న గ్రామీణ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మంత్రి విజ్ఞప్తి చేశారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లలో 9515481671, 8179329396 సంప్రదించాలని ఆయన అన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి కృష్ణారావు(75) ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారని తమకు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ డి.రవికుమార్ తెలిపారు. ఆయన మనుమడు దుద్దుపూడి కాశీవిశ్వనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. తప్పిపోయిన వ్యక్తి అనారోగ్యం, మానసిక స్థితిలో బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు.

అదృశ్యమైన బాలికల ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

నగరంలో అదృశ్యమైన ముగ్గురు బాలిక ఆచూకీని పోలీసులు గుర్తించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్పి డి.నరసింహకిశోర్ ప్రత్యేక చొరవతో అతి తక్కువ సమయంలోనే రాజమహేంద్రవరం పోలీసులు ఈ కేసును ఛేదించారు. అదృశ్యమైనట్లు తెలియగానే గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 24 మధ్యాహ్నం వారు ఇళ్ల నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారు. సిసి కెమెరాలు, టెక్నికల్ ఎవిడెన్స్, సోషల్ మీడియా అకౌంట్స్ వంటి వాటిని శోధించి ముగ్గురిని గుర్తించారు. కేసు ఛేదించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పి అభినందించారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం, సామర్లకోట

మండలంలో కోడి పందేలు, పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. ట్రైనీ ఎస్ఐ పి.శివగణేష్, సిబ్బంది దొండపూడి గ్రామ మేదరపేటలో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.9వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అలాగే కొవ్వూరుపాడులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సామర్లకోట: వేట్లపాలెంలో మంగాయమ్మ కాలనీలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేసిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సామర్లకోట సిఐ ఎ.కృష్ణభగవాన్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.11,350 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - రాజోలు

కడలిగుళ్లపాలెం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించగా, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన ఆకుమర్తి అన్వేష్, పెద్దపూడి శ్రీను, చెన్నాడం గ్రామానికి చెందిన దొండపాటి సన్నీ కలిసి మోటార్‌సైకిల్‌పై కడలిపల్లిపాలెంలోని గ్రూపులో జరిగిన క్రిస్మస్ వేడు కలో పాల్గొన్నారు. అనంతరం వారు మోటార్‌సైకిల్‌పై కడలి సెంటర్ నుంచి మురికిపల్లి వైపు వెళుతూ గుమ్మళ్లపాలెంలో ఉన్న సన్నీ ఇంటికి వెళ్లేందుకు ఎదుర్లంకకు తిరిగారు. ఈ సమయంలో వేగంగా వస్తున్న మరో బైక్‌పై వస్తున్న సోడే గణేష్ (భద్రాచలం) మితిమీరిన వేగంతో రాంగ్ రూటులో వచ్చి వెనుక నుంచి వీరి మోటార్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్ పై ఉన్న ముగ్గురు యువకులు కింద పడిపోయారు. మోటార్ సైకిల్ నడుపుతున్న శ్రీను, మధ్యలో కూర్చున్న సన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ఆకుమర్తి అన్వేష్(20) వెనుకకు పడిపోవడంతో తలకు గాయమై అక్కడికక్కడే మరణించాడు. పెద్దపూడి శ్రీను ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసికందు ప్రాణాలు కాపాడిన వైద్యులు

ప్రజాశక్తి-కాకినాడ

ఆడుకుంటూ మెంతో ఫ్లెష్ డబ్బా మింగిన చిన్నారిని జిజిహెచ్ వైద్యులు సకాలంలో స్పందించి కాపాడారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం దేవళ్లపల్లి గ్రామానికి చెందిన పంచా జయదుర్గ, పండా దొరబాబు మూడు రోజుల క్రితం ఫిట్స్ కోసం వైద్యం నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. వారికి 9 నెలల విజయదుర్గ అనే బాబు ఉన్నాడు. శుక్రవారం బాబు ఆడుకుంటూ మెంతో ఫ్లెష్ డబ్బా మింగేశాడు. బంధువులు గమనించి వెంటనే పిల్లల అత్యవసర విభాగానికి తీసుకుని వెళ్లారు. సిఎంఒ డాక్టర్ సుష్మ తక్షణమే స్పందించి డాక్టర్ సత్యవాణి, డాక్టర్ మాణిక్యం, డాక్టర్ కారిమా సాయంతో బాలుని గొంతులో అడ్డుకున్న మెంతో ఫ్లెష్ డబ్బాను తీసివేశారు. దీంతో బాలుని ప్రాణాలు నిలిచాయి.

విత్తన శుద్ధి, సేంద్రియ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వి.మురళీధర్ రైతులతో మాట్లాడారు. వరి సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి అని తెలిపారు. వరి విత్తనాలను సూడోమోనాస్, ఫ్లోరోసెన్స్‌తో ట్రీట్మెంట్ చేయడం వల్ల మొలక శాతం పెరుగుతుందని, నేల ద్వారా వచ్చే తెగుళ్లు, పోడ వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. పొడి వాతావరణంలో ఉన్న స్యూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ కిలో విత్తనానికి 10 గ్రాముల చొప్పున వినియోగించాలని రైతులకు సూచించారు. ఫార్మ్ యార్డ్ మెన్యూర్ అనగా పశువుల పెంట ఎరువులో ఉత్పాదకత పెంచవచ్చునని తెలిపారు. పశువుల పేడ, మూత్రం, ఎండిన ఆకులు, పంటలపై తదితరాలను కుప్పగా వేసి పూర్తిగా కుళ్లిన తర్వాత లభించే సేంద్రియ ఎరువుగా ఎఫ్‌వైఎం ఉపయోగపడుతుందన్నారు. ఇది నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్ తో పాటు సూక్ష్మ పోషకాలు, సేంద్రియ కార్బన్‌ను నేలకు అందిస్తుందన్నారు. దీంతో ఎఫ్‌వైఎం వినియోగించడం వల్ల నేలలో సేంద్రియ కార్బన్ పెరిగి నేల మెరుగు పడుతుందన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

- అధిక శాతం వెదజల్లు విధానాన్ని అవలంబిస్తున్న రైతులు
- 10 శాతం సాంప్రదాయ విధానాన్ని వరి నాట్లు



చోడవరం లో విత్తనాలు వెదజల్లుతున్న రైతు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రస్తుతం రైతులంతా దాళ్వా నాట్లు వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ముమ్మరంగా కొనసాగుతున్న నాట్లు ఇప్పటి వరకు 40 శాతం పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు తెలియజేశారు. సాధారణంగా దాల్వా పంటకు రైతులు వెదజల్లే పద్ధతిలో నాట్లు పూర్తి చేస్తున్నారు. 90 శాతం మంది ఇదే విధానాన్ని కొనసాగిస్తుండగా, 10 శాతం మంది రైతులు సాంప్రదాయ నాట్లు వేస్తున్నారు. రామచంద్రపురం మండలంలో 18 ఎకరాల్లోనూ, కె.గంగవరం మండలంలో 15 వేల ఎకరాల్లోనూ, కాజులూరు మండలంలో 16 వేల ఎకరాల్లోనూ వరి పంట సాగు అవుతోంది. ఇప్పటివరకు 40 శాతం నాట్లు పూర్తిగా అవడంతో మిగిలిన రైతులు యుద్ధ ప్రాతిపదికన నాట్లు వేసేందుకు పంట దమ్ములు పూర్తి చేసి వేద జరుగుతున్నారు. వ్యవసాయ అధికారులు అంచనా ప్రకారం జనవరి మొదటి వారంలో మొత్తం వరినట్లు పూర్తవుతాయని అంచనా వేశారు. తొలకరిలో పంట నష్టం సంభవించిన రైతులు ఆ లోటును పూడ్చుకునేందుకు పెద్ద ఎత్తున దాళ్వా పంటకు ఉపక్రమించారు ఖర్చుకు వెనకాడ కుండా ఎరువులు, పెట్టుబడి అధికమైన ఖర్చులు పెడుతూ పంటలు పండించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఇక వెదజల్లే పద్ధతిలో ఆకుముడి వేయడం ఆకుతీత వంటి పనులు లేకపోవడం వల్ల రైతులకు కొంతమేర కూలి పనులు కలిసి వస్తాయి. పెట్టుబడి తగ్గించి అధిక లాభాలు సమకూర్చుకునేందుకు వెదజల్లే పద్ధతి రైతులకు ఉపయోగపడుతుంది. అదేవిధంగా వెదజల్లే విధానంలో చేలు తొందరగా కోతకు వస్తాయని అధికారులు వివరించారు. బోండాల రకం అధికంగా నాటిన రైతులు దాళ్వా పంటకు రైతులు అధిక శాతం బోండాలు రకం 36 26, వంటి రకాలు అధికంగా నాట్లు వేస్తున్నారు. ఇవి 120 రోజులకు పంట చేతికి వస్తాయి. దీంతో అధికశాతం రైతులు వీటిని ఉపయోగిస్తున్నారు. వీటితోపాటుగా పిఆర్ రకం, 12 26 వంటి రకాలు రైతులు నాట్లు వేస్తున్నారు. ఇవి ప్రకతి వైపరీత్యాలకు తట్టుకుంటాయని రైతులు వీటిని ఎక్కువగా ఎంపిక చేసుకుంటారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

ప్రస్తుతం రైతన్నలకు దాళ్వా లో ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయ అధికారి టివిఆర్.మణిదీప్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. తొలకరిలో యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారని ప్రస్తుతం యూరియాతోపాటు డిఎపి ఎరువులు రైతులకు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని దాల్వా వరి చేతికి వచ్చేవరకు రైతులకు ఎరువులు పురుగుమందులు పూర్తిగా అందుబాటులో ఉండేందుకు అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ స్టాకులు ఏర్పాటు చేశామని రైతులందరికీ ఎరువులు కొరత ఉండదని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అదేవిధంగా నానో యూరియాపై అవగాహన కల్పించామని దీన్ని వాడటం వల్ల ఉపయోగం అధికంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు.



నరసరావుపేటలో సాంప్రసాయి నాట్లు వేస్తున్న కూలీలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఆదివారం పేటలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలోని తోటవారి వీధి, అన్నాయిపేట, ఆదివారపు పేటలో జరిగిన క్రిస్మస్ వేడుకలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో క్రిస్మస్ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల పాస్టర్లు, సంఘ పెద్దలు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలోపాస్టర్ ఆనంద్ కమార్, కనికళ్ళ కనకరత్నం కూటమి నాయకులు చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, పలువురు కూటమి పార్టీ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు మంత్రి చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. **ఆలమూరు:** నర్సిపూడిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో 8,418 పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున 12 నెలలకు రూ.60 వేల ఒకేసారి అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ దునే స్వామి నాయుడు, డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



నర్సిపూడి చర్చిలో ప్రసంగిస్తున్న ఎంఎల్ఎ బండారు



మండపేటలో ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరిస్తున్న సాయి తదితరులు

ఎంఎల్ఎ వేగుళ్లను కలిసిన సాయి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం, మండపేట

టిడిపి అమలాపురం పార్లమెంట్ మెయిన్ కమిటీ అధ్యక్షనిగా గుత్తుల సాయి ఉపాధ్యక్షులుగా ముత్యాల వెంకట్రావు, కార్యనిరాహక కార్యదర్శిగా కుంచె ప్రసన్న కుమార్ నియమితు లయ్యారు. శుక్రవారం మండపేట టిడిపి కార్యాలయంలో వారంతా రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞత తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళను పూలమాలలు, దుశ్శాలు వాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం నియమితులైన వారందరిని ఎంఎల్ఎ వేగుళ్ళ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

జనార్ధనస్వామి ఆలయంలో ముక్కోటికి ఏరాట్లు

ప్రజాశక్తి - ఆలమూరు



పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఎ.రాజు

ఈనెల 30న ముక్కోటి ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఎస్ఐ నరేష్‌లకు ఉత్తర ద్వార దర్శనం నిమిత్తం వచ్చే వారికి ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్ల గురించిన సిఫార్సు లేఖలను ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఇఒ నరేంద్ర కుమార్‌లు అందజేశారు. దీంతో ఎంపిడిఒ రాజు స్వయంగా ఆలయానికి విచ్చేసి జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న యాత్రికులను రద్దీని దృష్టిలో ఉంచుకొని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆయన సూచించారు.



అనాతవరం పాల్ ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న ఎఎంఒ పి.రాంబాబు

పాల్ ల్యాబ్స్ వినియోగంలో జిల్లాకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పిఎంశ్రీ పాఠశాలల్లో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) ల్యాబ్స్‌ను విద్యార్థులు వినియోగించుకోవడంలో జిల్లా ద్వితీయస్థానంలో నిలిచిందని సమగ్ర శిక్షా ఎఎంఒ, పాల్ ల్యాబ్స్ డిస్ట్రిక్ట్ కో- ఆర్డినేటర్ పి.రాంబాబు పేర్కొన్నారు. అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలిక ల గురుకుల పాఠశాలల్లోని పాల్ ల్యాబ్‌లను శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంఆ 9 పిఎం శ్రీ పాఠశాలల్లో నూతనంగా పాల్ ల్యాబ్‌లు ఏర్పాటుచేశామన్నారు. ఈ పాల్ ల్యాబ్స్‌నున 96.22 శాతం వినియోగంతో రాష్ట్రంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసమీ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అలాగు గురుకుల పాఠశాల విభాగంలో ముమ్మిడివరం బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు పాల్ ల్యాబ్‌ను 111.67 శాతం వినియోగించి రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే గతంలో మంజూరైన పాల్ ల్యాబ్స్‌లో కాలపరిమితి ముగియడంతో పాడైపోయిన ట్యాబ్స్ స్థానంలో కొత్త ట్యాబ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించనున్నామని అన్నారు. అనంతరం పాల్ ల్యాబ్‌లో వినియోగిస్నుత్న రికార్డులను పరిశీలించి, పాల్ ల్యాబ్ నోడల్ టీచర్ కె.తాతాజీ, ఇంగ్లీషు, తెలుగు ఉపాధ్యాయులు డి.వెంకట శేషారత్నం, జె.నాగవరలక్ష్మిలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనాతవరం ప్రభుత్వ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పోటీలు

ప్రజాశక్తి - రావులపాలెం

పొడగట్లపల్లి లక్ష్మీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వీర బాల దివాస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట సిడిపిఒ ఎ.గజలక్ష్మి ఆదేశాలు మేరకు సూపర్‌వైజర్ నాగ సత్యవేణి పర్యవేక్షణలో కార్యకర్త సంకు శ్రీలక్ష్మి వీర బాల దివాస్‌ను బాలలతో నిర్వహించారు. మ్యూజికల్ ఛైర్, స్టాంప్ డ్రాయింగ్ గేమ్, నెంబరింగ్ గేమ్, రన్నింగ్ రేస్ నిర్వహించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సులేషన్ బహుమతులు బాలలకు అందజేశారు. కార్యక్రమంలో తల్లులు, బాలలు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో వీరబాలల దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం

హసన్ బాద జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో వీర బాలల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కర్రి చిట్టిబాబు, ఆకేటి శ్రీకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకటరావు, దక్షిణా మూర్తి తదితరులు అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పిఎస్‌బిఎస్ కె.సుందరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న మాజీ సిఎస్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పంచారామ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని రాష్ట్ర మాజీ సిఎస్ ఐవిఆర్ కృష్ణారావు కుటుంబసభ్యులతో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భీమేశ్వరస్వామిని, మాణిక్యంబా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, ఇఒ అల్లు వెంకట దుర్గాభవాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు . అనంతరం కృష్ణారావు, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

ఇవిఎం, వివి.ప్యాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి రెవెన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం, వివి.పాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల, అగ్ని మాపక శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా ఇవిఎం గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (టిడిపి), ఎస్.అప్పారావు (బిఎస్‌పి), పోలిశెట్టి శ్రీను (కాంగ్రెస్), కె.కృష్ణమోహన్(ఆప్), ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), సిహెచ్.రమేష్ బాబు (బిజెపి),పలివెల వీరబాబు(సిపిఎం), ఎ.సత్యనారాయణ (జనసేన) పాల్గొన్నారు.

ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పిఎస్ఆర్ లా కాలేజీలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే 108 లేదా 112కు సమాచారం ఇవ్వాలని, గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లోపు ఆసుపత్రికి చేర్చాలని సూచించారు. ప్రమాద బాధితులను రక్షించిన వారికి జిల్లా కలెక్టర్ ద్వారా రూ.25,000 విలువైన గుడ్ సమారిటన్ రివార్డు అందజేస్తారని వివరించారు. కాబోయే లాయర్లుగా సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్, మాడిఫైడ్ సైలెన్సర్ల వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం నిషిద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాహనాలకు ఉపయోగించాలని సూచించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని మల్లాం, ఎల్ఎన్.పురం, కోలంక, ఎఫ్‌కె.పాలెం, నవఖండ్రవాడ గ్రామాల్లో పలువురికి మాజీ ఎంఎల్ఎ, టిడిపి అధికార ప్రతినిధి వర్మ శుక్రవారం సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సదర్భంగా వర్మ మాట్లాడుతూ సుమారు రూ.8 లక్షల చెక్కులను వారి ఇంటికి వెళ్ళి అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్‌రావు, నాయకులు పిల్లా సురేష్, బుర్రా కుమార్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - రావులపాలెం

క్షేత్రస్థాయిలో నెలకొని ఉన్న ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మండల పరిధి రావులపాడులో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు అందజేసిన అర్జీలను ఆయన స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే ఎంఎల్ఎ అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. సంబంధిత శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే అధికారులపై చర్యలు తప్పవన్నారు. దీనిలో భాగంగా మొత్తం 445 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.సుబ్రహ్మణ్యం, పెచ్చేటి చిన్నారావు, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి ఎంఎల్ఎ మద్దిపాటి

ప్రజాశక్తి -దేవరపల్లి

టిడిపి అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గోపాలపురం నియోజకవర్గం నుంచి రాజమండ్రి పార్లమెంట్ కమిటీకి ఎన్నికైన సభ్యులను ప్రకటించారు. సామాజిక వర్గాల సమతుల్యాన్ని పాటిస్తూ, పార్టీ విధేయతకు ప్రాధాన్యం ఇస్తూ కమిటీని రూపొందించినట్లు తెలిపారు.. ఈ కమిటీ కూర్పు పార్టీ బలోపేతానికి దోహదపడుతుందన్నారు. రాజమండ్రి పార్లమెంట్ కమిటీకి గోపాలపురం నియోజకవర్గం నుంచి జమ్ముల సతీష్‌ను పార్లమెంట్ ఉపాధ్యక్షునిగా, ఏపూరి దాలయ్యను అధికార ప్రతినిధిగా, బల్ల సూర్యచక్రంను పార్లమెంట్ కార్యదర్శిగా, రొంగల సత్యనారాయణను మీడియా కో-ఆర్డినేటర్‌గా, కొయ్యలమూడి సుధారాణి, దాసరి ధనలక్ష్మిలను ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నియమించారు. ఈ సందర్భంగా రాజమండ్రి పార్లమెంట్ కమిటీకి ఎన్నికైన సభ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



క్షేత్రస్థాయిలో వివరిస్తున్న వ్యవసాయ అధికారి

చిలకపాడులో పొలంబడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చిలకపాడులో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి నారుమడిలో సస్యరక్షణ, వరి నాట్లు వేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వరి పొలం గట్లపై వేసుకోదగిన పంటల గురించి, వివిధ రకాల వరి సాగు పద్ధతుల గురించి వివరించారు. వరిలో ప్రాథమిక దశలో ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని, రైతులు ఏ కోటా కు అవసరమైన యూరియాను ఆ సమయంలో మాత్రమే తీసుకొని, పైరు అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది స్వప్న, లోకేశ్వరి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్య జెఎసి నాయకులు

దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - రాజోలు

శివకోటి గ్రామంలో దళిత నాయకులపై దాడిచేసిన జనసేన నాయకుడు పినిశెట్టి బుజ్జి అతని అనుచరులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత సంఘాల ఐక్య జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం రాజోలు సర్కిల్ పోలీస్ స్టేషన్ ముట్టడించారు. తొలుత అంబేద్కర్ సామాజిక భవనంలో దళిత సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సర్కిల్‌పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని దళిత నాయకులపై దాడి చేసిన పినిశెట్టి బుజ్జిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. పలువురు దళిత జెఎసి నాయకులు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి శివకోడు పుంతలో ముసలమ్మ ఈవెంట్‌కి వచ్చిన దళిత బాలిక పాలపర్తి భవ్య శ్రీ మరణంపై నిజ నిర్ధారణకు మానవ హక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు జనుపల్లి సత్యానందం అలియాస్ నాని, బహుజన సమాజ్ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆకుమర్తి భూషణం వెళ్లారన్నారు. అయితే వారిపై శివకోటి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పినిశెట్టి వెంకట స్వామి అలియాస్ బుజ్జి, అతని అనుచరులు దాడి చేయడం దారుణమన్నారు. పోలీసుల ఎదుటే దళితులపై దాడికి పాల్పడినా ఇంతవరకూ వారిపై కేసు ఎందుకు నమోదు చేయలేదన్నారు. భవ్య శ్రీ మరణంపై రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళితుల పై దాడికి పాల్పడిన పినిశెట్టి బుజ్జిని అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు బత్తుల లక్ష్మణరావు, గెడ్డం సంపదరావు, బూషి జాన్ మోషె, మానవ హక్కుల నాయకులు ఎ.రవి, ముత్యాల శ్రీనువాసరావు, చవ్వాకుల వెంకట్, పి.పవన్, దళిత సంఘాల నాయకులు కొంకి రాజా మణి, నేతల నాని, బత్తుల మురళీకృష్ణ, నల్లి ప్రసాద్, జిల్లెళ్ళ ఉదయకుమార్, మెడబల రాజకుమార్, ఉల్లంపర్తి సత్యనారాయణ, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులపై సమీక్ష

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలో గల సాంఘిక సంక్షేమ హాస్టల్లో సమస్యలపై రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల శుక్రవారం జరిగిన ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ అధికారి అబ్బిరెడ్డి శ్రీనివాసరావు వివరించారు. పట్టణంలో గల ఎస్‌సి బాలుర వసతి గృహం శిథిలావస్థలో ఉన్నట్టు వివరించారు. అదేవిధంగా పట్టణంలోని ట్రాఫిక్ సమస్య, ఎస్‌సి, ఎస్‌టి కేసుల వివరాలను ఈ సమావేశంలో చర్చించారు. పలువురు తహశీల్దార్లు, రామచంద్రపురం డిఎస్‌పి ఇతర అధికారులు పాల్గొన్నారు.